

బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరుతున్న మంచిర్యాల అభ్యర్థి దివాకర్‌రావు కోడలు ఉదయశ్రీ

# దివాకర్‌రావును గెలిపించాలి

- నిత్యం ప్రజల మధ్య ఉండే నాయకుడు
- మంచిర్యాల బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కోడలు ఉదయశ్రీ
- నస్పూర్ 4వ వార్డు, ఆర్కే-6 గుడిసెలులో ఇంటింటా ప్రచారం

శ్రీరాంపూర్, నవంబర్ 16 : నిత్యం ప్రజల మధ్య, అందుబాటులో ఉండే నడిపెల్లి దివాకర్‌రావు కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని మంచిర్యాల నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే దివాకర్‌రావు కోడలు నడిపెల్లి ఉదయశ్రీ కోరారు. నస్పూర్ ఏరియా 4వ వార్డు గణేశ్‌నగర్, ఆర్కే-6 గుడిసెలు సుభాష్‌నగర్‌లో గురువారం కౌన్సిలర్ బెడిక లక్ష్మి, కో-ఆప్షన్ సభ్యులు ఎండీ నాసర్ ఆధ్వర్యంలో ఉదయశ్రీ ఇంటింటా, వాడవాడలా తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కారుగుర్తుకు ఓటు వేసి, దివాకర్‌రావును ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఉదయశ్రీ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నదన్నారు. అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్న కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా నిలబెట్టాలని, మంచిర్యాల ఎమ్మెల్యేగా నడిపెల్లి దివాకర్‌రావును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపెల్లి ప్రభాకర్, కౌన్సిలర్ బౌతు లక్ష్మి, పట్టణ మహిళా అధ్యక్షురాలు రౌతు రజిత, వార్డు అధ్యక్షుడు బింగి రాజేషం, నాయకులు రాంచందర్, భద్రయ్య, లవన్‌కుమార్, నరేశ్, సంతోష్ చారి తదితరులు పాల్గొన్నారు.



గోలేటిటౌన్‌షిప్‌లో ర్యాలీ తీస్తున్న బీఆర్ఎస్, టీబీజీకేఎస్ శ్రేణులు

# గోలేటిలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ ర్యాలీ

- ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మిని గెలిపించాలని ఓట్లు అభ్యర్థించిన శ్రేణులు

రెబ్బెన, నవంబర్ 16 : రెబ్బెన మండలం గోలేటి గ్రామ పంచాయతీలోని కార్మిక క్షేత్రంలో గురువారం సాయంత్రం బీఆర్ఎస్ పార్టీ, టీబీజీకేఎస్ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మిని గెలిపించాలని ర్యాలీ తీశారు. ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వారసంత ప్రాంతంలో ప్రతి ఒక్కరినీ కలుస్తూ బీఆర్ఎస్‌కు ఓటు వేసి, ఎమ్మెల్యేగా కోవ లక్ష్మిని గెలిపించాలని కోరారు. తెలంగాణ సర్కారు చేసిన అభివృద్ధి పనులు, బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలోని పథకాల గురించి వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికుల పాత్ర కీలకం



మందమర్రి కేకే-5 గనిపై కార్మికులతో మమేకమైన చెన్నూర్ అభ్యర్థి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్

- సీఎం కేసీఆర్‌కు నల్లసూర్యులంటే ఎంతో అభిమానం
- వారసత్వ ఉద్యోగాలను పునరుద్ధరించిన ఘనత ఆయనదే
- సింగరేణి ఉండాలంటే కేసీఆరే సీఎం కావాలి
- బొగ్గు గనులను ప్రైవేటుపరం కానివ్వం
- చెన్నూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్

మందమర్రి, నవంబర్ 16 : తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికులు కీలక పాత్ర పోషించారని, వారి కృషి, త్యాగం వల్లే రాష్ట్రం ఏర్పడిందని చెన్నూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. మందమర్రి ఏరియాలోని కేకే-5 గనిపై గురువారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మికులంటే సీఎం కేసీఆర్‌కు ఎనలేని అభిమానమని, వారి సంక్షేమానికి, సింగరేణి అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలంగాణ ఇంక్రిమెంట్ ఇచ్చి గౌరవించినట్లు గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణి బొగ్గు గనులను ప్రైవేటుపరం చేసేందుకు అనేక కుట్రలు చేస్తున్నదని, వారి కుట్రలను రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు తిప్పికొడుతున్నదని చెప్పారు. మందమర్రి ఏరియాలోని శ్రావణపల్లి ఓపెన్ కాస్ట్, కేకే-6 గనులను ప్రైవేటుపరం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం పలుమార్లు టెండర్లు పిలువగా, తమ భయంతో ఎవరు ముందుకు రావడం లేదని తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు చేసినట్లు, తాను ఒక్కరోజు నిరాహార దీక్ష చేసినట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో సీఎం కేసీఆర్ వెంట నడచిన సింగరేణి కార్మికుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తున్నదని చెప్పారు. గతంలో జాతీయ సంఘాలు రద్దు చేయించిన డిపెండెంట్ ఎంప్లాయీమెంట్ పథకాన్ని తిరిగి కారుణ్య నియామకాల పేరుతో అమలు చేయించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. దీంతో సింగరేణిలో ఎంతోమంది యువతకు ఉద్యోగాలు లభించాయని గుర్తుచేశారు. అలాగే వివిధ నోటిఫికేషన్లు ఇచ్చి, వందలాది మందికి సింగరేణిలో ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. కార్మికులకు స్పెషల్ ఇంక్రిమెంట్లు ఇవ్వడంతో పాటు 32 శాతం లాభాల వాటా ఇప్పించినట్లు గుర్తుచేశారు. ఇన్నాళ్లుగా కనబడని వివేక్, ఎన్నికలు రాగానే ఓట్ల కోసం కార్మికులపై దొంగ ప్రేమ చూపిస్తున్నాడని విమర్శించారు. కార్మికులు సంఘాల పేరుమీద ఆగం కావద్దని, తొందరపడవద్దని, కోట్ల డబ్బుతో కార్మికులను మోసం చేయాలని వివేక్ కుటుంబం చూస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్‌కు వేసే ఓటు సింగరేణి సంస్థను ముంచడానికేనన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఏరియాలోని రెండు గనులను దక్కించేందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వివేక్ ప్రయత్నిస్తున్నాడని, అందుకే బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్ టికెట్‌ను వంద కోట్లకు కొని ఓట్ల కోసం వస్తున్నాడని ఆరోపించారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, బడికెల సంపత్, ఓ రాజశేఖర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జే రవీందర్, పట్టణ ఇన్‌చార్జి బత్తుల శ్రీనివాస్, నాయకులు మద్ది శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీని నమ్మితే మోసపోతరు.. కాంగ్రెస్‌ను నమ్మితే గోసపడ్తరు..

మందమర్రి పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు, మహిళలతో కలిసి చెన్నూర్ అభ్యర్థి బాల్క సుమన్ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్థానిక సింగరేణి పాఠశాల ఆవరణలో మార్నింగ్ వాకర్స్‌తో ముచ్చటించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే తన హయాంలో గడచిన ఐదేండ్లలో నియోజక వర్గంలో జరిగిన అభివృద్ధిపై ముద్రించిన చెన్నూర్ ప్రగతి ప్రస్థానంలోని అభివృద్ధి పనులను వివరించారు. అలాగే భవిష్యత్‌లో కావాల్సిన పనులను అడిగి తెలుసుకున్నారు. యోగా సెంటర్‌లో ప్రచారం నిర్వహించిన ఆయన, కారుగుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని 7,8,9,10వ వార్డుల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గడపగడపనా ఆయనకు ఘన స్వాగతం లభించింది. ఆయా కాలనీల్లో మహిళలు బొట్టు పెట్టి, మంగళ హారతులిచ్చి స్వాగతం పలికారు. ఆయా కాలనీల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన యువకులు, మహిళలు బీఆర్ఎస్‌లో చేరగా, వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీని నమ్మితే మోసపోతరు.., కాంగ్రెస్‌ను నమ్మితే గోస పడ్తరని ప్రజలకు సూచించారు. కార్పొరేట్ వ్యాపారి వివేక్ వెంకటస్వామి కోట్ల రూపాయలతో వచ్చి, అర్రాస్ పెట్టి నాయకులను కొనుగోలు చేస్తున్నాడని ఆరోపించారు. ఆయనకు ఈ ప్రాంత భాష, సంస్కృతి, ప్రజల అవసరాలు ఏమీ తెలియవని, కేవలం అధికారం కోసమే డబ్బులు పంచుతున్నాడని ఆరోపించారు. మరి కొద్ది రోజుల్లో ఓటర్లకు కూడా డబ్బు పంపిణీ చేస్తారని, వారిచ్చే నగదు తీసుకొని, ఓటు మాత్రం కారు గుర్తుకు వేయాలని ఆయన కోరారు. గడ్డం వివేక్ వెంకటస్వామి కుటుంబ సభ్యులకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్, మహిళా విభాగం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మందమర్రిలో వాకర్స్‌తో మాట్లాడుతున్న విప్ బాల్క సుమన్

# ‘గండ్ర’ను గెలిపించుకుంటాం..

- విజయమే లక్ష్యంగా పనిచేస్తాం
- టీబీజీకేఎస్‌లో 80 మంది బీఎంఎస్ నాయకుల చేరిక
- కండువాలు కప్పి ఆహ్వానించిన అధ్యక్షుడు వెంకట్రావు



టీబీజీకేఎస్‌లో చేరిన బీఎంఎస్ నాయకులతో అధ్యక్షుడు వెంకట్రావు

జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 16(నమస్తే తెలంగాణ) : భూపాలపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిని గెలిపించుకుంటామని, విజయమే లక్ష్యంగా పనిచేస్తామని టీబీజీకేఎస్ నాయకులు స్పష్టం చేశారు. బీజేపీ అనుబంధ కార్మిక సంఘం భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) భూపాలపల్లి బ్రాంచ్ నాయకులు 80 మంది తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్)లో చేరారు. టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బడితెల సమ్మయ్య అధ్యక్షతన టీబీజీకేఎస్ కార్యాలయంలో బుధవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీకే-5 ఇంక్లైన్ పిట్ సెక్రటరీ సాంబయ్య, నాయకులు రఘోత్తం రెడ్డి, సంపత్‌రావు, కనకయ్య ఆధ్వర్యంలో బీఎంఎస్‌కు చెందిన సీనియర్ నాయకులు పీ సంపత్‌రావు, శ్రీకాంత్‌రెడ్డి, అఖిల్, సాయికుమార్, సుమన్‌రెడ్డి, సికింధర్, రవి, వీరన్న, బాలాజీ, ఓంకార్, నిఖిల్, సత్తిరెడ్డి, టేకుమట్ల రాజయ్య, దాసరి రాజ్‌కుమార్, దాసరి శ్రీనివాస్, నటరాజ్ తదితరులు గులాబీ గూటికి చేరారు. కాగా, టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావు వారికి కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా యూనియన్‌లో చేరిన బీఎంఎస్ నాయకులు మాట్లాడుతూ.. భూపాలపల్లిలో గండ్ర వెంకటరమణారెడ్డి గెలుపు కోసం సైనికుల్లా పనిచేస్తామని, అలాగే సింగరేణి ఎన్నికల్లో టీబీజీకేఎస్ గెలుపునకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు రత్నం సమ్మిరెడ్డి, నల్లబెల్లి సదానందం, గౌరీపతి శర్మ, రాజిరెడ్డి, రాయిశెట్టి కనకయ్య, కొచ్చర్ల రవి, రాంచందర్, కుమార్, మిరపాల నర్సింగరావు, కొలిపాక నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.